

# వయసు మనసు

## సూర్యప్రసాదరావు

"డియర్ ఫ్రెండ్స్! ప్రథమ ప్రయత్నానికి మించిన అందమైన అనుభూతి లేదంటారు... జీవితంలో... అదే.. మెయిడెన్ ఎక్స్‌పీరియన్స్! మీకు లెక్చర్లు వినడం ప్రథమం కాకపోయినా... నాకు మాత్రం లెక్చరివ్వడం... ప్రప్రథమం. అందుకే స్నేహితులారా! అని ఎందుకంటు న్నానంటే... ఏ గ్రేట్ అఫ్ బాయ్ ఈజ్ ఎ ఫ్రెండ్ టు హిజ్ ఫాదర్' అనేది ఆంగ్ల సూక్తి..."

"తెలుగు పంతులయినా... ఇంగ్లీషు కూడా దంచుతున్నాడు రోయ్.."

"అసలు ఇంగ్లీషు చదవకుండా ఎవడూ ఉండడురా... అందుకే తప్పులో... తడకలో... ఏదో ఏడుస్తున్నాడుగా... ఏడవనీ..."

వినిపించీ వినిపించనట్లు విసిరిన వెనకబెంచీల కామెంట్లకు వెనువెంటనే స్టేజీపై నుండి రియాక్షన్...

"మన స్నేహితులెవరో వెనక బెంచీలలో ఏడవటానికి ఉపక్రమిస్తున్నట్లున్నారు. అసలు ఏడుపనేదే లేకుంటే మానవునికి మనుగడే లేదు. అమిత సంతోషం, అమిత దుఃఖం గుండెల్లో ఇమడ లేనప్పుడు బయటకు వచ్చేది ఏడుపు రూపంలోనే! అందుకనే నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వ స్తాయి. ఆ ఏడుపుకూడా రాని రోజు మనిషి బ్రతకగలడా... అంటే సందేహమే...

"ఏడుపు ఏడు విధాలంటారు. ముద్దు ముద్దుగా ఏడ్వడం... కొద్దిగా శబ్దం చేయడం... నిశ్శబ్దంగా కన్నీరు కార్చడం... గుండెలోనే కుమిలిపోవడం... నిలువెల్ల వణికి పోవడం.... శోకాలు పెట్టడం... తను ఏడుస్తూ పదిమందిని ఏడ్పించడం... ఇందులో ఏదో ఓ విధానాన్ని ప్రయోగం చేసే రూపంలో మన స్నేహితులు ఉన్నట్లు న్నారు. ప్రస్తుతానికి వాయిదా వేయండి. ఏడుస్తూ ఏ పని ఆరంభించకూడదు. ఏడుపు శబ్దంతో లెక్చర్ ఆరంభం చేయడం నాకిష్టం లేదు. అందుకే ఆనందాన్ని అందించే అద్భుతమైన అనుభూతి... స్నేహంతో నా పాఠం మొదలు పెడతాను..."

"గురుడు మొదట్లోనే కొట్టాడురా... దెబ్బ!" వెనక బెంచీల వాళ్లు వాళ్ళలో వాళ్ళనుకున్నారు.

దాదాపు ఎనభైమందున్న క్లాసు. ఆలయ శబ్దానికి విరుద్ధంగా ఉన్న ఆ క్లాసురూం వాతావరణం. రెండు వ రుసలుగా విద్యార్థులు. ఓ వరుస సగం ఆక్రమించుకున్న విద్యార్థినుల వెనక విద్యార్థులు. విరిగిపోయిన బెంచీలు గదిలో ఓ మూల... మరో మూల కుప్ప చేసిన దుమ్ము. భారత నాట్యం చేస్తున్న బెంచీలు. వాటిని ఆడిస్తూ ఆనందించే అల్లరి విద్యార్థులు. పోతే... డయాస్‌పై ఇక్ష్వా కుల కాలాన్ని జ్ఞాపకం చేసే విరిగిపోయిన టేబిల్... లెక్చరర్ పుస్తకాలు పెట్టుకోడానికి వీలుగా వెనక బోర్డుపై కొత్త లెక్చరర్‌కు రకరకాల రంగు రంగుల పదాలతో స్వాగత వచనాలు!

ఆ డయాస్‌పై తెలుగుదనం మూర్తిభవించిన రాఘవ రాం! గ్లాస్కో ధోవతి... గ్లాస్కో లాల్చీ... ముఖాన కుంకుమ బొట్టు... చెవులకు రాళ్ళ కమ్మలు... కఠిన బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నాడనడానికి ఆనవాలుగా ఉన్న శరీరం... కాళ్ళకు చెప్పులు... ప్రిన్సిపాల్‌గారు పరిచయం చేస్తున్నప్పుడే... క్లాస్ రూం వాతావరణం అర్థమైపోయింది. క్షణకాలం బోర్డు మీది స్వాగతాలు... వెనక బెంచీల విసుర్లు పసిగట్టేశాడు. అందుకే అంత త్వరగా రిటార్టేషన్ ఇవ్వ గలిగాడు.

'స్నేహమనేది మానవునికి దేవుడిచ్చిన అమూల్యవ రం... ఆనందాన్ని అందించే అద్భుతమైన అనుభూతి. ఎవ రో అన్నట్లు... సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్...'. నిజాన్ని ఎంత చక్కగా చెప్పాడు. పవిత్రమైన స్నేహం ప్రాణాన్ని సైతం ఇస్తుంది. ఆ స్నేహాన్ని నిరూపించే చక్కని నిదర్శనాలు ఎన్నో... మన పు రాణాల్లో... కావ్యాల్లో... ఇతిహాసాల్లో..."

క్రమేపీ క్లాస్ రూం వాతావరణం రాఘవరాం కంట్రోల్‌లోకి వస్తోంది. వినకూడ దనుకుంటూనే వినాలనిపించే ఆ గొంతు గాంభీర్యం.... ప్రతీ అక్షరం స్పష్టంగా... బిగ్గరగా వినిపిస్తోంటే... అనాలోచితంగానే ఆయన మాటలు చెవుల్లోకి ప్రవేశిస్తున్నాయి.

క్లాసునంతా నిశితంగా పరిశీలిస్తూనే కొనసాగించాడు.

"అటువంటి స్వచ్ఛమైన స్నేహానికి మరో రూపమే 'శ్రీరామ సుగ్రీవ మైత్రి' వాల్మీకి విరచిత రామాయణంలోని కిష్కింధా కాండలో నిక్షిప్తమై ఉంది... ఈ తీయని సంఘటన..."

"కిష్కింధ అంటే ఏమిటిరా?"

"అంటేనా.... కోతులు తిరిగే చోటురా"

"కోతులంటే... ఇంత పొడవాటి తోకలు... కిచకిచలు.."

వెనక బెంచీలలో మళ్ళీ కిచకిచలు కోలాహలం...

రాఘవరాం వెంటనే అందుకున్నాడు...

"ముందు బెంచీల వాళ్ళంతా సావధానంగా వినండి. వెనక బెంచీల స్నేహితులు ప్రత్యేక్ష కిష్కింధా కాండను ప్రదర్శిస్తున్నారు. అలనాడు ఒక్క తెనాలి రామలింగడు మాత్రం ప్రత్యక్ష రామాయణం ప్రదర్శించ గలిగాడు. అటువంటి రామలింగలు ఎంత మందో... మన మధ్య ఉన్నందులకు మనం గర్వించాలి. కిష్కింధ రూపాన్ని మాకందరికీ చూపించిన మీకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు."

వెంటనే క్లాస్ రూంలో గుండుసూది వేస్తే వినిపించగలిగినంత నిశ్శబ్దం! వాలిపోయిన వెకన బెంచీల ముఖాలు...

క్షణం రాఘవరాం వృథా చేయడం లేదు.

"కోతులకూ నీతులు ఉన్నాయి. ఓ మాటకి అవి కట్టు బడతాయి. ఒక త్రాటిపై అవి నిలుస్తాయి. వాటి మధ్యనగల క్రమశిక్షణ మనకేదీ! అటువంటి కోతులు సాధించిన ఘనకార్యాలెన్నో! ఆంజనేయుని స్వామి భక్తికి సాటెవరని. అందుకే నాటి ఆంజనేయుడు మాకు ఆరాధ్యదైవం!

"ఋష్యమూక పర్వతంపై చరిస్తూ ఆంజనేయుడు రామలక్ష్మణులను గుర్తిస్తాడు. శ్రీరామచంద్రునికి దాసుడైపోతాడు. భార్యను కోల్పోయి విచారిస్తున్న సుగ్రీవునికి పరిచయం చేస్తాడు. ఇద్దరూ ఒకరి బాధ మరొకరికి తెలియజేస్తారు. అగ్నిసాక్షిగా ఇద్దరూ మైత్రి బంధంతో కలుపబడతారు. పవిత్రమైన స్నేహంతో ఇద్దరు ఆప్త మిత్రులౌతారు.

"ఆంతరంగిక విషయాలు అప్పుడు చర్చకొస్తాయి. ఇద్దరూ భార్యా వియోగంలో ఉన్నవారే... కానవయితే ఒకరి భార్యజాడ తెలుసు. మరొకరి భార్య జాడ అరయాలి. సుగ్రీవునికి అంతలో ఏదో జ్ఞప్తికొచ్చి వెంటనే

"ఏడుపు ఏడు విధాలంటారు. ముద్దు ముద్దుగా ఏడ్వడం... కొద్దిగా శబ్దం చేయడం... నిశ్శబ్దం కన్నీరు కార్చడం... గుండెల్లోనే కుమిలి పోవడం... నిలువెల్లా వణికి పోవడం... శోకాలు పెట్టడం తను ఏడుస్తూ ...

ఓ నగలమూట తెప్పించాడు.

'రామా! ఈ మధ్యన ఎవరో ఓ స్త్రీ ఆకాశ మార్గాన ఆర్తనాదం చేస్తూ వెళ్తూ ఈ నగల మూట ఋష్యమూకంపై జారవిడిచింది. అవి బహుశః నీ భార్యవేమో ఓసారి పరిశీలించి చూడు... ఆపై మనం ఆలోచిద్దాం...'

నగల మూట విప్పుతుంటే రాముని చేతులు తడబడ్డాయి. ఆభరణాలను గుర్తించడం ఆయన వశం కాలేదు. అసలు మనసు మనసులో లేదు. అందులోనూ కంటి ముందు సన్నని కన్నీటి పొర. విఫలయత్నం చేసి రాముడన్నాడు.

'లక్ష్మణా... నువ్వయినా చూడవయ్యా... ఈ ఆభరణాలు మీ వదిన గారివేమో!' లక్ష్మణుడా నగల మూట నందుకున్నాడు. ఒక్కో ఆభరణాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాడు. లక్షణుని ముకంలో రామునికే భావం ద్యోతకం కావడం లేదు. అంతలోనే ఆశ... అంతలోనే నిరాశ! ప్రతీ ఆభరణాన్ని పరిశీలించడానికి కావలసిన సమయం తీసుకుంటున్నాడు. ఇంతలో లక్ష్మణుని ముఖంలో ఆనందం వింతకాంతులు విరజిమ్మింది.''

రాఘవరాం గంభీరమైన కంఠస్వరం గది నాలుగు గోడల్ని పలకరించి వస్తోంది. ప్రతీ పదం స్పష్టంగా... స్వచ్ఛంగా... నాటకీయంగా ఉచ్ఛరించడంతో విద్యార్థులంతా మంత్రముగ్ధులై వింటున్నారు. విద్యార్థినులైతే మరీ... ఆభరణాల విషయం వచ్చేసరికి మరింత ఆసక్తిగా వింటున్నారు.

''లక్షణుడు ఒక్కో ఆభరణాన్ని అన్నగార్కి చూపించి మరీ చెబుతున్నాడు. 'అన్నా! ఈ కంఠహారం నా వదినది అవునో... కాదో తెలియదు. ఈ పచ్చల పతకం... ఉహూ... ఈ అరవంకీ కూడా... అర్థమవడంలేదు. ఈ రత్నాల వడ్డాణం సీతమ్మది అవునా... అంతుబట్టడం లేదు. కానీ... కానీ... ఈ మంజీరాలు మాత్రం నిశ్చయంగా మా తల్లి సీతమ్మవే! నిత్యం పాదాలను అలంకరించే ఈ పసిడి మంజీరాలు మాత్రం నా వదినగారివే... నిద్ర లేచీ లేవంగానే నేను ఆచరించే నా తల్లి పాదాభివందనానికి ప్రత్యుత్తరం ఇచ్చేవి ఈ మంజీరాలే! అన్నా ఈ మంజీరాలు నా తల్లివి... కనుక... ఈ ఆభరణాలన్ని మా యమ్మ జానకమ్మవే!''

లక్షణస్వామి గొంతులోని ఆర్ద్రత... పవిత్రత...



ఉద్వేగం... ఉత్సాహం అన్ని రాఘవరాం గొంతులో మిళితమై పోయి... సన్నివేశ వివరణను పండిస్తున్నాయి. డయాస్‌పై వివిధ పాత్రల వాచిక... ఆంగికాభి నయాలు మొదటి క్లాసులోనే రాఘవరాంకు ఫస్టు మార్కులిచ్చేశాయి.

''ఎంత మహత్తరమైన భావం? వదినగారి పాదాలు తప్పితే... అన్యధా... మనసా... వాచా... కర్మణా.. భావనకు సైతం తావివ్వని లక్షణస్వామి పవిత్రమైన పదజాలం! వదినగారి మంజీరాలు తప్పితే గుర్తించలేని ఆ అపూర్వ సహోదరుని అజరామరమైన అంతరంగం. పరాయి స్త్రీని కన్నతల్లిగా భావించే పవిత్ర హైందవ సంస్కృతికి... భారతీయ సాంప్రదాయానికి లక్ష్మణస్వామి ఓ ప్రతీక! మన సంస్కృతి ఎంత గొప్పది! మన సాంప్రదాయం ఎంత ఉన్నత మైంది! పరాయి స్త్రీని 'అమ్మా' అనే పిలుపుతో సంభోదించమనే మన ఆచా రం ఎంత ఉత్కృష్టమైంది!!''

విద్యార్థినుల మొహాల్లో అయితే... అమితమైన సంతోష తరంగాలు... ఆనంద డోలికలలో ఊగులాడే అంతరంగాలు... భారతీయ సాంప్రదాయంలో స్త్రీ ఉన్నత స్థానాన్ని ఎంత చక్కగా వివరించారు! స్త్రీని ఎలా గౌరవించాలో ఎంత చక్కగా విశదీకరించారు! పర స్త్రీని తల్లిగా భావింపచేసిన సంస్కృతిని ఎంత బాగా కళ్ళకు కట్టేలా ప్రదర్శించారు! క్లాస్ రూం వాతావరణంలో క్రమేపీ సర్వమానవ సౌభ్రాతృత్వం ఆక్రమించుకుంటోంది. ప్రతీ విద్యార్థి మనో నేత్రం ముందు నాటి అపూర్వ సన్నివేశం పంచరంగుల్లో కనిపిస్తోంది. క్రమేపీ లక్ష్మణ స్వామి అందరినీ ఆవహిస్తున్నాడు. రాఘవరాం అయితే... మూర్తీభవించిన లక్ష్మణ స్వామికి ప్రతీకగా ఉన్నాడు.

''లక్ష్మణ స్వామి నేటి యువతరానికి ఆదర్శం కావాలి! పరస్త్రీని తల్లిగానో, చెల్లిగానో భావించే మన సాంప్రదాయాన్ని యువకులు అలవరుచుకోవాలి. మన సంస్కృతి ఉగ్గుబాలతోనే బట్టి మన ఇంటి ఆడబడుచులు తమ పిల్లలకు జీర్ణింపచేయాలి. అప్పుడు రామరాజ్యం పూర్తిగా అవతరించకపోయినా... ఆ అవతరణకు నాందీ ప్రస్తావన పలుకుతుంది. నాడు నిజంగా దేశం సుభిక్షం అవుతుంది నైతికంగా! అప్పుడు మనం సాధించలేని కార్యాలుండవు... ఎదగలేని ఎత్తులుండవు!''

రాఘవరాం ఉపన్యాసానికి విద్యార్థులంతా నాగస్వరానికి తలలూపే నాగుల్లా ఉన్నారు.

ఇంతలో సడెన్‌గా లేచి నిలబడిందో అమ్మాయి!

''ఏమ్మా... ఏం కావాలి?'' రాఘవరాం ప్రశ్న!

''నన్ను 'అమ్మ' అని పిలుస్తారేమిటి సార్, నేను మీకు 'అమ్మలా' కన్పిస్తున్నానా! వయసు మళ్ళిన పదిమంది పిల్లల తల్లిలా అనిపిస్తున్నానా! ఇవ్వాళ 'అమ్మా' అంటారు. రేపు 'అమ్మమ్మా'అని పిలుస్తారు. వయసులో ఉన్న ఆడపిల్లను ఎప్పుడు 'అమ్మా' అని పిలవకండి... 'మిస్' అనో... పేరుపెట్టో పిలవండి... ముఖ్యంగా నన్ను... నాలాంటి వాళ్ళను..''

రాఘవరాం నిశ్చేష్టుడయ్యాడు.

ఇంతలో గంట మ్రోగింది!

గమనిక: ఈ కథానిక ఎవరినీ ఉద్దేశించి వ్రాయలేదు... కేవలం కల్పితం.

-రచయిత *



సంజాయిషీ

''అర్ధరాత్రి రోడ్డుమీద ఎందుకు తిరుగుతున్నావ్! కారణం చెప్పు!'' గదమాయించాడు పోలీస్.

''కారణం ఏం చెప్పాలో తెలిస్తే ఇంటికి పోయి భార్యకే చెప్పుకుందును కదా!'' కోపంగా బదులిచ్చాడు మధు.

—జోకర్ (హైదరాబాద్)


